క్లుప్తంగా

ఆశాజనకంగా వరి దిగుబడులు



చాట్రాయి: సార్వా సాగుకు వర్షాలు అనుకూలించడంతో దిగుబడులు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. మండలంలో సుమారు 10, 500 ఎకరాల్లో వరి సాగు చేయగా 28 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందంటున్నారు. సగటున ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులు వచ్చినట్లు అధికారులు, రైతులు అంటున్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేపట్టారు. తెగుళ్ల దాడి తక్కువగా ఉందని, తుపాన్లు వచ్చినా వరి పంటకు నష్టం జరగక పోవడంతో గతం కంటే ఈ ఏడాది 3 శాతం దిగుబడులు పెరిగినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఉర్దూ ఎస్ఏ పోస్టు మంజూరుకు వినతి




కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలకు ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టు మంజూరుకు కృషి చేయాలని హెచ్ఎం పద్మలతకు ఎస్ఎంసీ చైర్మన్ బి.బాజీ కోరారు. హెచ్ఎంకు వినతిపత్రం సోమవారం అందజేశారు. హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టు లేనందున ముస్లిం మైనార్టీ బాలికలు ఉర్దూ భాషకు దూరం అవుతున్నట్లు తెలిపారు. వీరంతా ప్రాథమిక విద్యాభ్యాసం ఉర్దూను ప్రథమ భాషగా ఎంపిక చేసుకుని 5వ తరగతి వరకు చదివారన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హిందీ భాష బోధించేందుకు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఉర్దూ మొదటి భాషగా చదవలేకపోతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నట్లుగానే కొండపల్లి జెడ్పీ పాఠశాలకు కూడా పోస్టు మంజూరు చేయించాలని కోరారు. ముస్లిం మైనార్టీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆయాలు, వాచ్‌మెన్‌లకు వేతనాలు చెల్లించాలి



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పరిశుద్ధ్య కార్మికులు, నైట్ వాచ్‌మెన్‌లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యక్షురాలు కుంచం రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఈవో సీహెచ్ పుష్పలత, ఎంఈవో-2 రత్నశ్యామ్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది ఐదు నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం జీవో 413 ద్వారా విడుదల చేసిన రూ.600 కోట్ల నిధులు స్కూల్ శానిటేషన్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల బ్యాంక్ ఖాతాల్లో తక్షణం జమ చేయాలన్నారు. శానిటేషన్ పరికరాలు, గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఆయాలు, వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఉండాలి



ఇబ్రహీంపట్నం: ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న ఆయన ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులను కలిశారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యవర్గ సభ్యులు శింకా శ్రీహరి, ఎంవీ.నారాయణరావు, శ్రీనివాసరావు, సుధా కర్, శేషగిరి, మాధవరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

నూజివీడు: మానవ హక్కుల వారోత్సవాల్లో భాగంగా జెర్సీ డెయిరీ ఆధ్వర్యంలో మండలంలోని మద్దాయిగుంట యూపీ స్కూల్లో సోమవారం విద్యార్థులకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, డెయి రీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పది రోజులు.. నాలుగు చోరీలు

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు

నూజివీడు: నూజివీడు పట్టణంలో గడిచిన పది రోజుల్లో దొంగలు నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడగా, ఒక ఇంట్లో చొరబడేందుకు ప్రయత్నించి అలికిడి అవ్వడంతో వెళ్లిపోయారు. ఇంటికి తాళాలు వేసి రెండు రోజులు తెరవకుండా ఉంటే చాలు మూడో రోజు ఆ ఇంటిని దొంగలు లక్ష్యంగా చేసుకుని లూటీ చేసేస్తున్నారు. పట్టణ ప్రజలు ఇంటికి తాళం వేసి ఊరెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు.



నూజివీడు గాంధీనగర్‌లో ఈ గృహంలోనే చోరీకి ప్రయత్నించారు

వరుస చోరీలు..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు నాలుగుచోట్ల దొంగతనాలు చోటు చేసుకున్నాయి. మరో చోట చోరీకి ప్రయత్నించి అలికిడి కావడంతో వెళ్లిపోయారు. ఈనెల 1న నెహ్రూపేటలో, 2వ తేదీన ఎంప్లాయీస్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినప్పటికీ రెండిళ్లలో నగదు, ఆభరణాలేమీ లేకపోవడంతో నష్టం జరగలేదు. 3న రాత్రి పీజీ కేంద్రం ఎదురుగా ఉన్న సుగ్గిశెట్టి శ్రీనివాసరావు ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లి నాలుగో తేదీ తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉండటమే కాకుండా బెడ్‌రూమ్‌లో బీరువా తాళం పగులగొట్టి రూ.25వేల నగదు, ఒక కాసు చెవి దిద్దులను చోరీ చేశారు. ఈనెల 7న రాత్రి బాపూనగర్‌లోని గణేష్ టవర్స్ పక్కన ఉండే జవ్వాజి శ్రీనివాసరావు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వీళ్లు కూడా మైలవరం మండలం బొర్రగూడెంలోని బంధువుల ఇంటికి అయ్యప్ప పడి పూజలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ లోగా ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ చేశారు. ఇక్కడ రూ.1.30 లక్షల నగదు, 3 కాసుల బంగారు నగలు అపహరించారు. ఈ ఘటనలను పరిశీలిస్తే చోరులు పట్టణంలోనే తిరుగుతున్నట్లుగా అర్థమవుతోంది. తాళం వేసిన ఇళ్ల కోసం గాలిస్తున్నట్లుగా రూఢీ అవుతోంది.

ఇంటికి తాళం వేసి సినిమాకు వెళ్లగా..

పట్టణంలోని రైతు బజారు ఎస్టేట్ అధికారిణిగా పనిచేసే కొలుసు పుష్పవల్లి కుటుంబం గాంధీనగర్‌లో నివాసం. అయితే వీరి కుటుంబ సభ్యులు ఈనెల 8న రాత్రి సెకండ్ షో సినిమాకు వెళ్లారు. అయితే ఇంట్లో అత్తను ఉంచి ప్రధాన ద్వారం తలుపునకు తాళం వేసి రాత్రి 10 గంటల సమయంలో సినిమాకు వెళ్లారు. సినిమా చూసి తిరిగి 2 గంటలకు రాగా ఇంటి ప్రధాన ద్వారం తాళాన్ని పగులగొట్టేందుకు అంగతకులు తీవ్రంగా ప్రయత్నించినట్లుగా ఉంది. ఈ లోగా పుష్పవల్లి అత్త వచ్చి ఎవరో తాళం పగులగొట్టడానికి ప్రయత్నించారని, గట్టిగా కేకలు వేయడంతో వెళ్లిపోయారని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోతే ఈ ఇంట్లో సైతం చోరీ జరిగేది.

పోలీసులకు సవాలు..

వరుస చోరీలు చేస్తూ పోలీసులకు సవాలు విసురుతున్నట్టుగా ఉందని ప్రజలు అంటున్నారు. చోరీలను నివారించడంలో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంప్లాయీస్ కాలనీలో సీసీ ఫుటేజీలను పరిశీలించినా తగిన ఆధారాలు లభించలేదని తెలుస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి..



ఇంటికి తాళం వేసి ఊర్లు వెళ్తుంటే ఇంట్లో నగదు, బంగారు ఆభరణాలు ఉంచవద్దని, ఊరు వెళ్తుంటే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నాం. ఎక్కడికక్కడ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. వేలి ముద్రలను పరిశీలించి దొంగను పట్టుకునేందుకు పోలీస్ యంత్రాంగమంతా పనిచేస్తున్నాం. అంతేగాకుండా గస్తీని ముమ్మరంగా నిర్వహిస్తున్నాం.

– పీ సత్యశ్రీనివాస్, సీఐ, నూజివీడు టౌన్

18 అర్జీలను స్వీకరించిన ఆర్డీఓ

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మోవిడి వాణి మొత్తం 18 అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్వై నూరానీ, డీఎల్‌పీఓ సుందరి, ఏడీఏ జీ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. స్వీకరించిన అర్జీలలో కొన్ని..



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మోవిడి వాణి

కేసు పెట్టినా పట్టించుకోలేదు..

- గోళ్ల రమేష్, సందీప్ అనే ఇద్దరు వచ్చి రూ.50 వేలు ఇవ్వాలంటూ దుర్భాషలాడి, ఇంటి ముందు బైక్‌లో పెట్టిన రెండు కాసుల బంగారు గొలుసు లాక్కెళ్లారని, దీనిపై ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని రమణక్కపేటకు చెందిన ముక్కు రమాదేవి ఆర్డీఓకు అర్జీ అందజేశారు.
- ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన బలుసు నాగఫణీంద్రకుమార్ చెరువు గట్టును ఆక్రమించి కోళ్లఫారం షెడ్లు నిర్మించారు. గట్టును పొక్లయిన్‌తో తొలగించి దారిని ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై చర్యలు కోరుతూ చెక్కపల్లి గ్రామస్తులు, ఆయకట్టు రైతులు అర్జీని అందజేశారు.
- 18 ఏళ్ల పాటు ఆర్మీలో పని చేసిన తనకు ముసునూరు మండలం కొర్లగుంటలో 2.50 ఎకరాల పల్లపు భూమి గతంలో ఇచ్చారు. 12 ఏళ్ల పాటు సాగు చేసుకున్న తర్వాత రెవెన్యూ అధికారులు పట్టాను రద్దు చేసి వేరేచోట ఇస్తామని ఇచ్చిన భూమిని తీసేసుకున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా మరోచోట భూమిని ఇవ్వలేదు. ఇప్పటికైనా తనకు భూమిని కేటాయించాలని నూజివీడులోని గాంధీనగర్‌కు చెందిన వెల్లంకి శివాజీ అర్జీ అందజేశారు.

రెండు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలోని సెయింట్ జోసఫ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కృష్ణా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక ఓసీ, మరొక పోస్టుకు ఎస్సీ అభ్యర్థులతో భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పాల దిగుబడిని పెంచండి

ముసునూరు: పాల దిగుబడిని మరింత పెంచి, మరిన్ని లాభాలు పొందాలని కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ శనగల వెంకటశివజ్యోతి సూచించారు. రమణక్కపేటలో పాల సేకరణ కేంద్రం వద్ద సంఘ అధ్యక్షురాలు మిద్దె పద్మ అధ్యక్షతన సోమవారం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 173 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.3,27,330 బోనస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్, క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, సూపర్‌వైజర్ గణేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన వ్యక్తి జగన్మోహనరావు

గంపలగూడెం: నిజాయితీ నిబద్ధత క్రమశిక్షణ కలిగిన వ్యక్తి దివంగత సువారపు జగన్ మోహన్‌రావు అని పలువురు వక్తలు కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు సువారపు చంద్రశేఖరరావు తండ్రి సువారపు జగన్మోహనరావు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. సోమవారం గంపలగూడెంలో నిర్వహించిన జగన్ మోహన్‌రావు సంతాపం సభలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. జగన్మోహనరావు సేవలను కొనియాడారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా అధ్యక్షతన కొనసాగిన సంతాప సభలో సీపీఐ నేతలు పసుపులేటి వెంకయ్య, తూము కృష్ణయ్య, సీపీఎం నేతలు తులసీరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ శేషగిరిరావు, సీహెచ్ నర్సారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ చెరుకూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రేగళ్ళ వీరారెడ్డి పాల్గొన్నారు.

13న మాదిగల ఆత్మీయ సభ

నూజివీడు: పట్టణంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 13న నిర్వహించనున్న నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సభను జయప్రదం చేయాలని నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం సభ నిర్వహణపై ముఖ్య నాయకులతో సమీక్షించారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ హాజరవుతారని వారన్నారు. జంక్షన్ రోడ్డులోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ సభ ప్రారంభానికి ముందు రాజీవ్ సర్కిల్ వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొండేటి బాబీ, ఆముదాల ఇస్సాకు, కోపూరి సుధాకర్, ముల్లంగి జమలయ్య, దొండపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

నూజివీడు: విద్యార్థి దశ నుంచి నైతిక విలువలతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత ప్రొఫెసర్ వి.శ్యామ్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ సిద్దార్థ జూనియర్ కళాశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదువుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. అనంతరం విదేశీ విద్య, యూనివర్సిటీల ఎంపిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు కె.అనంతలక్ష్మి, కోశాధికారి ఎస్వీ రావు, సెక్రటరీ రాజేంద్రబాబు, డైరెక్టర్లు కె.తిరుపతి రావు, రామలింగేశ్వరరావు, రవిబాబు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ వి.శ్యామ్

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం కరువు

మైలవరం: పామాయిల్ తోటలు సాగు చేస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. నష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో..

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండలంలో 1,750 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలం 15 ఎకరాలు, రెడ్డిగూడెం మండలం 1,050 ఎకరాలు, జి.కొండూరు మండలం 430 ఎకరాలు, విజయవాడ రూరల్ మండలంలో 150 ఎకరాల్లో రైతులు పామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు.

గతంలో ఇలా..

గతంలో పామాయిల్ సాగు చేసే రైతులకు స్ప్రింక్లర్లు, పైపులు సబ్సిడీ కింద అందజేసేవారు. రైతులకు ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహించే పరిస్థితి ఉండేది. గతంలో క్వింటా పామాయిల్ గింజలకు సుమారుగా రూ.25 వేల వరకు చెల్లించారు.

ప్రస్తుతం ఇలా..

ప్రస్తుత ప్రభుత్వం వాణిజ్య పంటల అభివృద్ధిపై అంతగా దృష్టి పెట్టడం లేదు. దీంతో రైతులు పంటల సాగుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం క్వింటా సామాయిల్ గింజలు రూ.20,400 మించి చెల్లించడం లేదు. రైతులు తాము పండించిన పంటను మైలవరం మండలంలోని పుల్లూరు, మొర్సుమల్లి గ్రామాల్లోని కొనుగోలు సెంటర్‌లకు తరలించాల్సి ఉంది. దీంతో రైతులపై రవాణా చార్జీల భారం పెరుగుతోంది. ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.



మైలవరంలోని పామాయిల్ తోట (ఇన్‌సెట్) ఆయిల్ మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న పామాయిల్ గెలలు

రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి..



జిల్లాలో పామాయిల్ తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు మేలు కలుగుతుంది. తోటల సాగు విస్తీర్ణం పెంచాలి. రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి.

– తొమ్మండ్రు యేసు, మైలవరం

పాసు పుస్తకాలకు దరఖాస్తు చేయండి

తునికిపాడు(గంపలగూడెం): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. మండలంలోని తునికిపాడులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ సదస్సులో పాస్ పుస్తకాలలో సర్దుబాట్లు, నూతన పాస్ పుస్తకాల మంజూరి తదితర అంశాలను పరిష్కారిస్తామన్నారు. మండల ప్రత్యేక అధికారి వీఎస్ఎన్ఎన్ రాజు, ఆర్ఐ వీరభద్రం, వీఆర్వోలు పాల్గొన్నారు.



తునికిపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజకుమారి

11 నుంచి రెవెన్యూ సభలు

చాట్రాయి: మండలం పరిధిలో ఈ నెల 11 నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.ప్రశాంతి సోమవారం తెలిపారు. 11న జనార్ధనవరం, 12న తుమ్మగూడెం, 13న చనుబండ, 16న పోలవరం, 17న మంకొల్లు, 18న చిన్నంపేట, 19న ఆరుగొలనుపేట, 20న కోటపాడు, 21న సోమవరం, 23న కృష్ణారావుపాలెం, 24న చిత్తపూరు, 26న పోతనపల్లి, 27న బూరుగుగూడెం, 28న పర్వతాపురం, 30న కొత్తగూడెంలో ఈ సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభల్లో పాల్గొని రైతులు తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

విజయవాడరూరల్: షాబాద, జక్కంపూడి గ్రామాల్లో కూటమి నాయకులు యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఆర్ఎస్ నంబర్ : 88లో నెలరోజులుగా రాత్రీ పగలు తేడాలేకుండా కొండలను పిండిచేసి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. ఇప్పటికే వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తరలించుకుపోయారు. అక్రమ రవాణాపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదల కారణంగా కొండపై నుంచి కిందకు జారిన మట్టిని ఆదివారం అర్ధరాత్రి అడ్డగోలుగా తవ్వకాలు జరిపి లారీల్లో రవాణా చేయడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి ఆర్ఐ రాజేష్ పోలీసుల సహకారంతో అక్రమ గ్రావెల్ తవ్వకాల ప్రదేశానికి రెవెన్యూ సిబ్బందితో చేరుకున్నారు. కొండలను పిండి చేస్తున్న ఒక పొక్లయిన్, మట్టి లోడింగ్ చేసిన టిప్పర్ లారీని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను విజయవాడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జక్కంపూడిలో టిప్పర్‌లో గ్రావెల్ లోడుచేస్తున్న పొక్లయిన్

కేరళపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రం

సీఐటీయూ నేత సుధాకర్

మైలవరం: కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిని దేశ ప్రజలందరూ ఖండించాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేరళ రాష్ట్రం అక్షరాస్యతలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. కార్మికుల కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పైగా ఉందని, వలస కార్మికులను అతిథి కార్మికులుగా గుర్తించి అన్ని వసతులు కల్పిస్తోందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం 30 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి సేవలందిస్తోందన్నారు. అయినా కేంద్రం కక్ష పూరితంగా పనిచేస్తోందని విమర్శించారు. ఈ నెల 11న విజయవాడ బందర్ రోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సభకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్న, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారన్నారు. విజయవాడలో జరిగే కేరళ సంఘీభావ సభను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సభ కరపత్రాలను విడుదల చేశారు. ముఠా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి బి.మారేశ్వరరావు, నాయులు ఉపతల నారాయణ, వెంకటేశ్వరరావు, తంబి రామారావు, చెన్నారావు, కుప్పాల దినేష్ పాల్గొన్నారు.



సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బ్లాక్ చైన్ టెక్నాలజీ పరిశ్రమలకు మేలు

మైలవరం: బ్లాక్ చైన్ టెక్నాలజీ పరిశ్రమలకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల ఆధ్వర్యంలో 'ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్‌చైన్, ఇండస్ట్రీ ట్రెండ్స్ అండ్ ప్రాక్టికల్ ఇంప్లిమెంటేషన్స్' అనే అంశంపై తృతీయ సంవత్సరం సీఎస్ఈ, ఐటీ విద్యార్థులకు వారాంతం వర్క్‌షాపు సోమవారం ప్రారంభించారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల కెరీర్‌కు మేలని అభిప్రాయపడ్డారు. డాక్టర్ ఎమ్.శ్రీనివాసరావు డీన్ ఎకడమిక్స్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాపు ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మీద అనుభవాన్ని అందించడమే కాకుండా పరిశ్రమల్లో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించ గల సృజనాత్మకత పెంపొందుతుందని వివరించారు. వర్క్‌షాప్‌నకు వి.పవన్, బి.ఓబుల్, ముఖ్యవక్తలుగా విచ్చేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.వీరయ్య, ఐటీ విభాగాధిపతి డాక్టర వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కోఆర్డినేటర్స్‌గా బి.స్వాతి, ఎం.కిరణ్‌కుమార్, బి.రవీంద్ర చంటిబాబు, ఆర్.పవిత్ర వ్యవహరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వక్తలు, విద్యార్థులు

అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి

ఆగిరిపల్లి: యువత అవినీతికి వ్యతిరేకంగా పోరాడడానికి ముందుకు రావాలని ఇండియన్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ బాబు అన్నాడు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవినీతి రహిత సమాజం-యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సురేష్ మాట్లాడుతూ యువత అవినీతిపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ యోహాన్, ఆగిరిపల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాతూరి రవి, ఆర్గనైజేషన్ కార్యదర్శి లాల్ సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యోహాన్

40 లీటర్ల సారా స్వాధీనం

ఆగిరిపల్లి: ఎక్సైజ్ అధికారులు సోమవారం ఈదులగూడెంలో దాడులు చేసి 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పామర్తి శివప్రసాద్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఈఎస్టీఎఫ్ పాండురంగారావు, ఈఎస్టీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు వ్యక్తుల బైండోవర్

మైలవరం: సారా కేసుల్లో ఐదుగురు పాత ముద్దాయిలను బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జోస్యుల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలోని రెడ్డిగూడెం మండల తహసీల్దారు ఎదుట ఉప్పతల బాబూరావు, చింతిరాల కుమారి, నాగుల కుమారి, పెదగమల్ల వెంకటేశ్వరమ్మ రెడ్డిగూడెం, భరోద్ చిన్ని, సిద్దార్థనగర్ తండాకు చెందిన వారు. వీరు సారా కేసుల్లో పాత ముద్దాయిలు కావడంతో బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

- సప్తాహ మహోత్సవం ప్రారంభం

మేడూరు(గంపలగూడెం): మేడూరు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో అఖండ హరే రామ నామ సప్తాహ మహోత్సవాలుసోమవారం ఘనంగా ప్రారంభించారు. విఘ్నేశ్వరపూజతో ఆలయ ప్రధాన అర్చకుడు కోమండూరి ఆంజనేయాచార్యులు ప్రారంభించారు. విశేష అర్చనలు నిర్వహించారు. రెండో రోజు మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహిస్తామని మేనేజర్ ప్రసాద్ తెలిపారు.